సాక్షి
ఆదిలాబాద్

సోమవారం । 30 । అక్టోబర్ । 2023



ఓటేయనివారు 3,48,736

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో దాదాపు 3.5 లక్షల మంది పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. ఓటు వేయకపోతే ప్రశ్నించే హక్కు కోల్పోయినట్లే. 10లో▸



విద్యుత్ కోతలతో ఇక్కట్లు 11లో▸

బేలలో అప్రకటిత విద్యుత్ కోతలతో జనం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 20 రోజులుగా కరెంట్ సరఫరాలో తరుచూ అంతరాయం ఏర్పడుతుందంటున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/18.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉదయం పొగమంచు ప్రభావం కనిపిస్తుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

సుధీర్‌కుమార్‌కు సర్దార్ పటేల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సుధీర్‌కుమార్

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కె) గ్రామానికి చెందిన న్యాయవాది సంగెం సుధీర్‌కుమార్‌కు సర్దార్ వల్లబాయి పటేల్ ప్రతిభ అవార్డు దక్కింది. ఈమేరకు హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు అందజేశారు. పటేల్ జయంతి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సత్య సంగీత ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో సేవలు అందించిన వారిని అవార్డులకు ఎంపిక చేశారు. ఇందులో భాగంగా సంగెం చారిటబుల్ ట్రస్టు ద్వారా జిల్లాలో సేవలందిస్తున్న సుధీర్‌కుమార్‌కు అవార్డు దక్కింది. ఇందులో బీసీ సంక్షేమశాఖ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్, సత్యసంగీత ఇంటర్నేషనల్ సంస్థ అధ్యక్షుడు ఓంకార్‌రాజు, సినీ నిర్మాత మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్నికల అధికారులకు శిక్షణ

కైలాస్‌నగర్: జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు (పీవో), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓ)లకు ఈనెల 30నుంచి నవంబర్ ఒకటో తేదీ వరకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలోని పీవో, ఏపీవోలకు శాంతినగర్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బోథ్ నియోజకవర్గం లోని పీవో, ఏపీవోలకు ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయని తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఎన్నికలు బహిష్కరిస్తాం

- తాటిగూడ కాలనీవాసుల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

ఆదిలాబాద్: కాలనీ సమస్యలు పరిష్కరించకుంటే ఎన్నికలను బహిష్కరిస్తామని జిల్లా కేంద్రంలోని తాటిగూడవాసులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 60 ఏళ్లుగా రైల్వే పట్టాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. స్టేషన్ మీదుగా మార్కెట్‌కు వెళ్లేందుకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. స్పష్టమైన హామీ ఇస్తేనే ఎన్నికల్లో పాల్గొంటామని, లేకుంటే బహిష్కరిస్తామని స్పష్టం చేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కల్పన ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగే కార్యక్రమానికి ఫిర్యాదులు, సలహాలు, సూచనలు ఇచ్చేవారు 9959226002 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెల్లబంగారం మెరిసేనా..!



వివరాలు
జిల్లాలో పత్తిసాగు విస్తీర్ణం : 3లక్షల 50వేల ఎకరాలు
ఈఏడాది దిగుబడి అంచనా : 28 లక్షల క్వింటాళ్లు
మద్దతు ధర క్వింటాలుకు : రూ.7,020
బహిరంగ మార్కెట్‌లో ధర : రూ.6,500– రూ.6,800
గతేడాది కొనుగోలు చేసిన పత్తి : 10లక్షల 51వేల క్వింటాళ్లు

- నేటి నుంచి పత్తి కొనుగోళ్లు
- అధిక వర్షాలతో దిగుబడిపై ప్రభావం
- గిట్టుబాటు ధర కోసం రైతన్నల ఎదురుచూపు
- మార్కెట్లో తక్కువ ధరే అంటున్న వ్యాపారులు
- 'మద్దతు'తో రంగంలోకి సీసీఐ



మార్కెట్ యార్డులో సిద్ధం చేసిన తూకం యంత్రం

ఆదిలాబాద్‌టౌన్: ఈ సారైనా పత్తి రైతుల్లో ఆనందం కనిపించేనా.. ఏటా ఏదోరూపంలో రైతన్న నష్టపోతూనే ఉన్నాడు.. ఓ ఏడు అతివృష్టి, మరో ఏ డు అనావృష్టి, పంటలు బాగా పండితే మద్దతు ధర లేకపోవడం, దిగుబడులు లేని సమయంలో ధరలు పెరగడం.. ఇలా అనేక సమస్యలతో సతమతం అవుతున్నాడు. కనీసం పెట్టుబడి రాని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ ఏడాది పత్తికి అంతర్జాతీయ మార్కెట్లో ధర తక్కువగా ఉందని ప్రైవేట్ వ్యాపారులు చెబుతున్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆయా మార్కెట్లలో క్వింటాలుకు రూ.6,500 నుంచి రూ.6,800 వరకు పలుకుతుందని చెబుతున్నారు. గతేడాది మద్దతుకు మించి ధర పలికింది. మొదటి నుంచి చివరి వరకు ప్రైవేట్ వ్యాపారులే పంటను కొనుగోలు చేశారు. సీసీఐ రంగంలో ఉన్నప్పటికీ అసలు బోణీ కొట్టకపోవడం గమనార్హం. అయితే ఈసారి మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రైవేట్ వ్యాపారులు రంగంలో ఉండనున్నప్పటికీ వేలంలో ధర పెంచుతారా.. లేదా.. అనేది వేచిచూడాల్సిందే. మద్దతు ధరకు మించి పలికితే ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేయనున్నారు. ధర తక్కువగా ఉంటే సీసీఐ రంగంలోకి దిగనుంది. నేటి నుంచి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు షురూ కానున్నాయి.

గిట్టుబాటయ్యేనా..

పత్తికి ఈసారైనా గిట్టుబాటు ధర లభిస్తుందా అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఏటా తేమ కొర్రీతో నష్టపోతూనే ఉన్నారు. ప్రైవేట్ వ్యాపారులు ప్రజాప్రతినిధులు, అధికారుల ఒత్తిడితో తేమ ఉన్నప్పటికీ కొనుగోలు చేస్తూ వచ్చారు. సీసీఐ రంగంలో ఉంటే 8 నుంచి 12 శాతం తేమ ఉంటే కొనుగోలు చేస్తుంది. అంతకు మించితే కొనుగోలుకు నిరాకరిస్తారు. దీని ప్రభావం రైతులపై పడనుంది. ప్రస్తుతం చలి తీవ్రత పెరుగుతుండడంతో మంచు కురుస్తోంది. పత్తిలో 20 నుంచి 30 శాతం వరకు తేమ ఉండే అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. తేమ విషయంలో మార్కెట్ యార్డులో అన్నదాతలు ఆందోళనకు దిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. 8 శాతం తేమ ఉంటే మద్దతు ధర క్వింటాలుకు రూ.7,020, తేమశాతం 9 ఉంటే క్వింటాలుకు రూ.6,949, పది శాతం ఉంటే రూ.6,809, తేమ 12 శాతం ఉంటే రూ.6,739 చెల్లించనున్నారు. ఇంతకుమించి తేమ ఉంటే కొనుగోలు చేయని పరిస్థితి తలెత్తనుంది.

అతివృష్టితో పంటలకు నష్టం..

ఈఏడాది అతివృష్టి కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. సోయాతో పాటు పత్తి పంటలు కొట్టుకుపోయాయి. ప్రస్తుతం దిగుబడులు అంతంత మాత్రంగానే వచ్చే అవకాశం ఉండడంతో కనీసం పెట్టుబడి కూడా వచ్చేలా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రెండు నెలల నుంచి వర్షాలు లేక కాయ సైజు పెరగడం లేదని, పూత రాకపోవడంతో దిగుబడిపై ప్రభావం చూపుతున్నట్లు పేర్కొంటున్నారు. బోరుబావులు, నీటి సదుపాయం ఉన్న రైతులు మాత్రం పంటకు నీరందిస్తున్నారు. వర్షాధారంపై ఆధారపడ్డ వారికి మా త్రం దిగుబడులు అంతంత మాత్రమే వచ్చే పరిస్థితులున్నాయి. ఈసారి ఎకరానికి 5 నుంచి 6 క్వింటాళ్ల వరకు దిగుబడి రావచ్చని అంచనా వేస్తున్నా రు. అయితే క్వింటాలుకు మద్దతు ధర రూ.10వేలు ఉంటేనే తాము పెట్టిన పెట్టుబడి లభిస్తుందని పేర్కొంటున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో నేటి నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నాం. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే తూకం కాంటాలను సిద్ధం చేశాం. రైతులకు ఇబ్బందులు కలగకుండా తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, మూత్రశాలలను ఏర్పాటు చేశాం. గతేడాది జిల్లా వ్యాప్తంగా 10లక్షల 51వేల క్వింటాళ్లు కొనుగోలు జరిగాయి. ఈఏడాది 28లక్షల క్వింటాళ్లు అంచనా వేశాం. రైతులు పత్తిని ఆరబెట్టి తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుంది. బ్యాంక్ అకౌంట్‌కు తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేసుకోవాలి. బయోమెట్రిక్ ఆధారంగా కొనుగోలు ఉంటాయి. రైతుల బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ అవుతాయి.

– శ్రీనివాస్, మార్కెటింగ్ ఏడీ, ఆదిలాబాద్

కాంగ్రెస్‌లో లొల్లి


కంది శ్రీనివాసరెడ్డి


సాజిద్ ఖాన్


గండ్రత్ సుజాత


సంజీవ్ రెడ్డి


భార్గవ్ దేశ్‌పాండే

- ఆదిలాబాద్ అభ్యర్థి 'కంది'కి వ్యతిరేకంగా..
- నేడు సమావేశమవుతున్న అసమ్మతి నేతలు
- కార్యకర్తలతో సమాలోచనలు.. ఆ పై నిర్ణయం
- మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడితో పాటు పలువురు రాజీనామా
- శ్రీనివాసరెడ్డికి మద్దతుగా మాజీ ఎమ్మెల్యే అల్లుడు సంతోష్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి..

సాక్షి,ఆదిలాబాద్: కాంగ్రెస్‌లో లొల్లి షురువైంది. ఆ పార్టీ ఆదిలాబాద్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డికి వ్యతిరేకంగా అసమ్మతి నేతలు తిరుగుబావుటా ఎగరవేస్తున్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని రత్నా గార్డెన్స్‌లో సోమవారం కార్యకర్తలతో సమావేశం కానున్నారు. మరోవైపు మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ కలీమ్‌తో పాటు మరో 15 మంది పార్టీకి ఆదివారం రాజీనామా చేశారు.

టికెట్ ఆశించి భంగపాటు..

ఆదిలాబాద్ నుంచి జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత, మార్కెట్ కమిటి మా జీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి టికెట్ కోసం విస్తృతంగా ప్రయత్నాలు చేశారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు భార్గవ్ దేశ్‌పాండే కూడా వీరికి మద్దతుగా నిలిచారు. ప్రధానంగా పారాషూట్ నేత కంది శ్రీనివాసరెడ్డికి టికెట్ ఇవ్వొద్దని వీరంతా ముక్తకంఠంగా డిమాండ్ చేస్తూ వచ్చారు. తమలో ఎవరికి ఇచ్చినా అందరం కలిసి పనిచేస్తామని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. అయితే రెండో జాబితాలో కంది శ్రీనివాసరెడ్డి పేరు ఖరారు కావడంతో వీరంతా ఖంగుతిన్నారు. సోమవారం ఈ నలుగురు నేతలు కార్యకర్తలతో సమావేశం అవుతుండగా ప్రాధాన్యత సంతరించుకుంది. కార్యకర్తల నిర్ణయం మేరకు ముందుకు నడవాలని భావిస్తున్నారు. గడిచిన మేలో కంది శ్రీనివాసరెడ్డి బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నుంచి పార్టీలో తనకంటూ క్యాడర్ సిద్ధం చేసుకుంటూ వస్తున్నారు. అయితే ముందు నుంచి పార్టీలో ఉన్న కార్యకర్తలు ప్రస్తుతం సమాలోచనలో పడ్డారు. దీనికి కారణం లేకపోలేదు.అభ్యర్థి శ్రీనివాసరెడ్డి తమను ఎలా కలుపుకుపోతారా అనే విషయంలో సందిగ్ధం నెలకొంది. ఈ నేపథ్యంలో అసమ్మతినేతలు సమావేశమవుతుండటం,కార్యకర్తలనుంచి అభిప్రాయం సేకరిస్తుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

మద్దతు కూడగట్టుకుంటున్న కంది..

కాంగ్రెస్ అభ్యర్థిగా ఖరారు కావడంతో కంది శ్రీనివాసరెడ్డి ఇతర ముఖ్య నేతల మద్దతు కూడగట్టుకునే యత్నాలు మొదలుపెట్టారు. చేరికలపై ఆయన దృష్టి సారించారని చెప్పుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్యే వామన్‌రెడ్డి అల్లుడు అల్లూరి సంతోష్‌రెడ్డి ఆయనకు మద్దతుగా సోమవారం కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ప్రచారం జరుగుతుంది. సంతోష్‌రెడ్డి గతంలో బీఆర్ఎస్‌లో క్రియాశీలకంగా వ్యవహరించినప్పటికి ఆ తర్వాత రాజకీయంగా తటస్థంగా ఉంటూవచ్చారు. ఇవన్ని పరిణా మాలు కాంగ్రెస్‌లో ఆసక్తి కలిగిస్తున్నాయి.

కాంగ్రెస్‌కు పలువురి రాజీనామా



రాజీనామా పత్రాలను చూపుతున్న నాయకులు

ఎదులాపురం: పార్టీకోసం ఏళ్లపాటు కృషి చేసిన వారికి కాంగ్రెస్ అధినాయకత్వం మొండిచేయి చూపిందని, ఈమేరకు తనతో పాటు పలువురు పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు పార్టీ మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ కలీం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన నాయకులను విస్మరించి ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్న వ్యక్తికి టికెట్ కేటాయించడం ఏంటని ప్రశ్నించారు. పార్టీ సీనియర్ నాయకులైన అల్లూరి సంజీవరెడ్డి, గండ్రత్ సుజాత, సాజిద్ ఖాన్‌లలో ఎవరికైనా టికెట్ కేటాయించాలని, తాము రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. అయితే తమ అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకోకుండా డబ్బులు ఆధారంగా చేసుకొని టికెట్‌ను వేరే వ్యక్తికి ఇవ్వడం కలిచివేసిందన్నారు. ఈ నేపథ్యంలో పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. మైనార్టీ సెల్‌కు సంబంధించి జిల్లా, పట్టణ కమిటీ నాయకులు ఈ మేరకు రాజీనామా పత్రాలను తనకు అందజేసినట్లు వివరించారు. అనంతరం రాజీనామా పత్రాలను ప్రదర్శించారు. ఇందులో నాయకులు రసూల్‌ఖాన్, అన్వర్, ఇమ్రాన్ ఖాన్, మీనాజ్, సబీర్, షేక్ రిజ్వాన్, ఇర్ఫాన్, ఆసిఫ్, అహ్మదుల్లా ఖాన్, గౌస్, హనీఫ్, మునీర్, సమీర్ తదితరులు ఉన్నారు.

చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీ తనిఖీలు

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



మేడిగూడ చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ

నార్నూర్: ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చెక్‌పోస్టులు కీలకపాత్ర పోషిస్తాయని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గాదిగూడ మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు గ్రామమైన మేడిగూడలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు, ఉట్నూర్ మండలంలోని దేవుగూడ చెక్‌పోస్టును ఆదివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించారు. గాదిగూడ స్టేషన్‌ను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని 10 చెక్ పోస్టుల్లో కేంద్ర బలగాలతో పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా తరలించే మద్యం, డబ్బు, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తువులను జిల్లాకు రాకుండా ఆయా చెక్‌పోస్టుల వద్ద 24గంటల పాటు వివిధ శాఖల సమన్వయంతో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. కోడ్ అమలులోకి వచ్చిన నుంచి ఇప్పటి వరకు జిల్లాలో రూ.1కోటి 33లక్షల 38వేల750 నగదు స్వాధీనం చేసుకుని ఎస్ఎస్టీ, ఐటీ శాఖలకు అందించామన్నారు. అలాగే రూ.8లక్షల 87వేల 609 విలువైన 1,390 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రూ.7లక్షల 53వేల విలువైన 34.660 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు 381 కేసుల్లో 706 మందిని ఇప్పటి వరకు బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, నార్నూర్ సీఐ ప్రేంకుమార్, ఎస్సై మహేశ్ తదితరులున్నారు.

నిరుద్యోగులపై నిర్లక్ష్యమేలా..!?

- ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చాలి
- ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలి
- 'పబ్లిక్ పల్స్'లో నిరుద్యోగుల ఆవేదన



పోటీ పరీక్షల కోసం సన్నద్ధం అవుతున్న నిరుద్యోగులు

ఆదిలాబాద్/ఎదులాపురం: నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదు. నాటి ఉద్యమ ఆకాంక్షలకు అనుగుణంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. నిరుద్యోగుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలి. ఏప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా జాబ్ క్యాలెండర్ విడుదల చేయడమే కాకుండా ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని పలువురు తమఅభిప్రాయాలు వెలిబుచ్చారు. 'సాక్షి' నిర్వహించిన క్యాంపెయినింగ్‌లో నిరుద్యోగుల అభిప్రాయాలు ఇలా..

నిరుద్యోగుల ప్రస్తావనేది..?



ఏ ప్రభుత్వం వచ్చినా నిరుద్యోగుల గురించి ఆలోచించట్లేదు. ఎలక్షన్ల సమయంలో మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేస్తున్నారు. అవి కూడా అస్పష్టంగా ఉండడంతో తిప్పలు పడాల్సి వస్తోంది. తక్కువ సమయం ఉండటం వల్ల ప్రిపరేషన్ కాలేకపోతున్నాం. మేనిఫెస్టోల్లో ఆయా పార్టీలు నిరుద్యోగుల గురించి ప్రస్తావించకపోవడం విడ్డూరం.

– దత్తు, ఆదిలాబాద్

లక్షల్లో పోటీ..



స్వరాష్ట్రంలోనూ నిరుద్యోగుల పరిస్థితి ఘోరంగా ఉంది. పూర్తి స్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవడంతో సర్కారు కొలువులపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. పోస్టులు అతి తక్కువగా ఉండడంతో లక్షల్లో పోటీ పడాల్సిన దుస్థితి. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణలో ఏళ్లు గడుస్తున్నా నిరుద్యోగులు ఎదురుచూపులే మిగిలాయి.

– రాజు, లాండసాంగ్వి, ఆదిలాబాద్

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి...



ఉద్యోగ నియామకాలకు సంబంధించి స్పష్టమైన జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి. తదనుగుణంగా ప్రణాళికాబద్ధంగా నియామకాలు చేపట్టాలి. ప్రిపరేషన్ కోసం నిర్దిష్టమైన సమయం కేటాయించాలి.

– ప్రవీణ్, జైజవాన్ నగర్, ఆదిలాబాద్

గ్రూప్-1 రెండుసార్లు రద్దు..



ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గ్రూప్ వన్ పరీక్షలు రెండు సార్లు రద్దయ్యాయి. గ్రూప్–2 పరీక్షలు రెండు సార్లు వాయిదా పడ్డాయి. గ్రూప్– 3 పరీక్షలకు సంబంధించి ఇప్పటి వరకు తేదీని ప్రకటించలేదు. గ్రూప్స్ కోసం ఎన్నిసార్లు సన్నద్ధం అయినా నిరాశ తప్పడం లేదు. నేరడిగొండ మండలం నుంచి వచ్చి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కొలువు కోసం ఎంతో ప్రిపరేషన్ అవుతున్నాం. పరీక్షలు వాయిదా పడుతున్నాయి.

– హిమబిందు, నేరడిగొండ

పూర్తి స్థాయిలో భర్తీ చేపట్టాలి



దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉంది. అలాంటి వారికి ఉద్యోగ, ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదు. యువతకు వంద శాతం న్యాయం చేకూర్చేలా పూర్తిస్థాయిలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు వేయాలి. వచ్చేది ఏ ప్రభుత్వం అయినా నిరుద్యోగులకు న్యాయం చేయాలి.

వెంకటేశ్, టీచర్స్ కాలనీ, ఆదిలాబాద్

టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేయాలి



ప్రస్తుత ప్రభుత్వానికి యువత, నిరుద్యోగుల పరంగా చిత్తశుద్ధి లేదు. పోటీ పరీక్షల నిర్వహణలో టీఎస్పీఎస్సీ వైఖరితో ఇది తేటతెల్లం అవుతుంది. తెలంగాణ ఉద్యమంలో, గడిచిన ఎన్నికల సమయాల్లో ఇచ్చిన హామీలు వేరు.. అధికారంలోకి వచ్చాక చేసింది వేరు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి. అప్పుడే యువత, నిరుద్యోగులకు మేలు చేకూరుతుంది.– రాజు, సాంగి, జైనథ్

సమస్యాత్మకం.. నిఘా కట్టుదిట్టం

- ఆయా పోలింగ్ కేంద్రాల గుర్తింపు
- జిల్లాకు ఎనిమిది ప్రత్యేక బెటాలియన్లు
- ఇప్పటికే విధుల్లోకి రెండు..

పోలింగ్ కేంద్రాల వివరాలు...

నియోజకవర్గం	మొత్తంకేంద్రాలు	ఓటర్లు
ఆదిలాబాద్	290	2,35,748
బోథ్	302	2,06,690

జిల్లాలో ఇలా..

అతి సమస్యాత్మకమైన కేంద్రాలు : 5

సమస్యాత్మకమైనవి : 80
(ఆదిలాబాద్ 38, బోథ్ 42)

ఇచ్చోడ: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పోలీసులు నిఘా కట్టుదిట్టం చేశారు. జిల్లాలో మొత్తం 592 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 5 అతిసమస్యాత్మకమైనవిగా, 80 సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. 2014, 2018 ఎన్నికల్లో జరిగిన గొడవలు, అల్లర్లను దృష్టిలో పెట్టుకుని పోలీసులు, అధికారులు గ్రామాలవారీగా వివరాలు సేకరించారు. వీటిని ఎన్నికల కమిషన్‌కు అందజేశారు. ఈసీ ఆదేశాల మేరకు ఈ కేంద్రాల్లో ప్రత్యేక బలగాలతో బందోబస్తు నిర్వహించనున్నారు.

జిల్లాకు ఎనిమిది ప్రత్యేక బెటాలియన్లు

ప్రధాన రాజకీయ పార్టీల మధ్య గొడవలు, రిగ్గింగ్ కుయత్నం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని ఆయా పోలింగ్ కేంద్రాలను పోలీసు యంత్రాంగం అతిసమస్యాత్మకం, సమస్యాత్మకంగా గుర్తించింది. వీటిపై నిఘా కట్టుదిట్టం చేసింది. ఇప్పటికే కేంద్ర బలగాలను మోహరించింది. జిల్లాకు ఎనిమిది బెటాలియన్లను కేటాయించగా ఇప్పటి వరకు రెండు చేరుకున్నాయి. వచ్చే నెల 3లోగా మిగతావి చేరుకుంటాయని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

సమస్యాత్మక కేంద్రాల్లో కొన్ని...

బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడ మండలంలో గుండాల, కేశవపట్నం, ఎల్లమ్మగూడ, సిరిచెల్మ, నేరడిగొండ మండలంలో పెద్ద బుగ్గారం, వడూర్, గుడిహత్నూర్ మండలంలో తోషం, మన్నూర్, గుడిహత్నూర్, సిరికొండ మండలంలోని సిరికొండ, తలమడుగు మండలంలో కజర్ల, రుయ్యాడి, దేవాపూర్, బజార్‌హత్నూర్ మండలంలో పిప్రి, గిర్నూర్, దేగామ, చందునాయక్ తండా, కొల్హరి గ్రామాలను గుర్తించారు. తాంసి మండలంలో కప్పర్ల, వడ్డాడి, గోట్కురి, తాంసి, భీంపూర్ మండలంలో అర్లి, పిప్పల్‌కోటి, వడూర్, నిపాని గ్రామాలను గుర్తించారు.



జిల్లా కేంద్రంలో పోలీసుల కవాతు(ఫైల్)

ఆదిలాబాద్ నియోజకవర్గంలో...

బేల మండలంలో కొగ్దుర్, కొబ్బాయి, సైద్‌పూర్, సాంగిడి, జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్, పెండల్‌వాడ, గిమ్మ, సాంగ్వి, నిరాల గ్రామాలను గుర్తించారు.

క్లుప్తంగా

కాలినడకన అమ్మవారి దర్శనం



బాసరకు వచ్చిన వృద్ధుడు

భైంసా: మహారాష్ట్రలోని పర్బని జిల్లాకు చెందిన కిసాన్‌రావు అనే భక్తుడు కాలినడకన బాసరకు చేరుకుని ఆదివారం సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నాడు. వృద్ధాప్యంలోనూ విచిత్ర వేషధారణతో అంతదూరం నుంచి బాసర అమ్మవారి దర్శనానికి రావడంతో స్థానికులు, భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. స్థానికులు అతన్ని పలకరించగా సరస్వతీ అమ్మవారి దర్శనం కోసం వచ్చానని, ఏ పుణ్యక్షేత్రానికైనా ఇలాగే వెళ్తానని చెప్పాడు. తాను శ్రీరాముని సేవకుడినని, చేతిలో కాషాయ జెండా, డమరుకం మోగిస్తూ శ్రీరాముని జపం చేయడం ఆనందాన్ని ఇస్తుందన్నాడు.

ఓసీ సంఘాల అధ్యక్షుడిగా సంతోష్



జనగాం సంతోష్

ఆదిలాబాద్‌టౌన్: ఓసీ సంఘాల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఆదిలాబాద్ పట్టణానికి చెందిన జనగాం సంతోష్ ఎన్నికయ్యారు. ఈమేరకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్లుగా సంతోష్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన సేవలను గుర్తించి ఉమ్మడి జిల్లా బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యంతో పోలీసులు


నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లిలో ఆదివారం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో అడ్డిగ భోజన్న ఇంట్లో 11 లీటర్ల మద్యం పట్టుకున్నట్లు ఎస్సై రవీందర్ పేర్కొన్నారు. మద్యం విలువ రూ.5,140 ఉంటుందని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రూ.13 లక్షల నగదు పట్టివేత

భైంసా(ముధోల్): బాసర గోదావరి బ్రిడ్జి వద్ద ఆదివారం రూ.13 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. గోదావరి బ్రిడ్జి వద్ద ఫారెస్ట్ చెక్‌పోస్ట్ సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నాయకాకు చెందిన బాలాజీ మేడేవార్ వద్ద నగదు పట్టుబడింది. ఇందుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళ మెడలోంచి గొలుసు అపహరణ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని కైలాస్‌నగర్‌కు చెందిన మార్క గోదావరి మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు అపహరించినట్లు ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు. కైలాస్‌నగర్‌కు చెందిన గోదావరి ఆదివారం ఇంటి ఎదుట ఫోన్‌లో మాట్లాడుతుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో నుంచి బంగారు గొలుసును అపహరించుకుని వెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



పోలింగ్ శాతంపై ప్రభావం

భైంసాటౌన్ (ముధోల్): 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ భారత రాజ్యాంగం ఓటుహక్కు కల్పించింది. ఎందుకంటే ప్రజాస్వామ్య దేశంలో ప్రజల చేత ఎన్నుకోబడినవారే నాయకులు. ఇలా ఎన్నుకోబడినవారు ప్రజారంజక పాలన చేయకపోతే తిరిగి సమర్థుడైన నాయకుడిని ఎన్నుకోవాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహిస్తోంది. ఎంతో వ్యయప్రయాసలకోర్చి ఈ ప్రక్రియ నిర్వహిస్తుండగా చాలామంది పోలింగ్‌రోజును సెలవుదినంగా భావించి ఇళ్లకు, వ్యక్తిగత పనులకు పరిమితమవుతున్నారు. మనప్రాంత అభివృద్ధిపై నిలదీయాలంటే ముందుగా ఓటు వేయాలి. ఓటు వేయకపోతే ప్రశ్నించే హక్కు కోల్పోయినట్లే. నవంబర్ 30న పోలింగ్ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా ఓటుహక్కు వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది.

గత అసెంబ్లీ ఎన్నికలు పరిశీలిస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 3.5 లక్షల మంది పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. అంటే సుమారుగా రెండు చిన్న నియోజకవర్గాల్లోని ఓటర్ల సంఖ్యకు సమానంగా ఓటుహక్కు వినియోగించుకోలేదంటే అతిశయోక్తి కాదు. ఓటు వేయడంపై ఇప్పటికీ చాలామంది ఆసక్తి చూపడం లేదు. పోలింగ్ కేంద్రాల్లో గంటల తరబడి క్యూలో నిల్చోవడం, పోలింగ్‌రోజున ఇతర ప్రాంతాలకు వెళ్లడం, వ్యక్తిగత పనులకు ప్రాధాన్యం ఇవ్వడం, మారుమూల గ్రామాలు, రోడ్డు సౌకర్యం లేని ప్రాంతాల్లో పోలింగ్ శాతంపై ప్రభావం చూపుతోంది.

జంగ్ తెలంగాణ

- ఉమ్మడి జిల్లాలో పోలింగ్‌కు దూరం
- ఓటింగ్‌పై అనాసక్తి

పోలింగ్ శాతం పెంచేందుకు...

ఈసారి పోలింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా దివ్యాంగులు, వృద్ధులు ఇంటి నుంచే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించింది. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు గంటల తరబడి క్యూలో నిల్చునే ప్రయాస తగ్గించేలా కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అధిక సంఖ్యలో ఓటర్లు ఉన్న కేంద్రాల్లో అదనపు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

శాసనసభ ఎన్నికలు నవంబర్‌లో రెండోసారి

మంచిర్యాలటౌన్: రాష్ట్ర శాసనసభకు నవంబర్ 30న జరగనున్న ఎన్నికలు ఇదేమాసంలో రెండోసారిగా గుర్తింపు పొందనున్నాయి. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత నవంబర్ నెలలో రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. 1952లో దేశంలో మొట్టమొదటిసారిగా రాష్ట్రాలకు ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1989 నవంబర్ 22న ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్రంలో జరిగిన పలు ఉప ఎన్నికలను మినహాయిస్తే, రాష్ట్ర అసెంబ్లీకి 34 ఏళ్ల తర్వాత నవంబర్‌లో అంటే 2023 నవంబర్ 30న ఎన్నికలు జరగడం రెండోసారి.

ఎన్నికలు జరిగిన తేదీలు

సంవత్సరం	నెల	తేదీ
1952	-	-
1957	ఫిబ్రవరి	25
1962	ఫిబ్రవరి	08
1972	మార్చి	15
1978	ఫిబ్రవరి	25
1983	మే	01
1985	మే	03
1989	నవంబర్	22
1994	డిసెంబర్	01
1999	సెప్టెంబర్	18
2004	ఏప్రిల్	20
2009	ఏప్రిల్	16
2014	ఏప్రిల్	30
2018	డిసెంబర్	07

ఆసిఫాబాద్‌ను ఏలిన ఆ నలుగురు..

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలుగా గెలిచిన బెల్లంపల్లి నాయకులు
- మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించిన గుండా మల్లేశ్
- రెండుసార్లు విజయం సాధించిన దాసరి నర్సయ్య
- ఒక్కోసారి గెలిచిన పాటి సుభద్ర, అమురాజుల శ్రీదేవి



పాటి సుభద్ర



అమురాజుల శ్రీదేవి



దాసరి నర్సయ్య



గుండా మల్లేశ్

ఉమ్మడి ఆసిఫాబాద్ ఎస్సీ అసెంబ్లీ నియోజకవర్గాన్ని బెల్లంపల్లికి చెందిన నలుగురు రాజకీయ నాయకులు వరుసగా 33ఏళ్లు ఏలారు. నలుగురూ కలిసి మొత్తంగా ఏడు పర్యాయాలు ఎమ్మెల్యేలుగా గెలిచి సత్తా చాటారు. బెల్లంపల్లి ప్రాంత వాస్తవ్యులైన దాసరి నర్సయ్య (కాంగ్రెస్), గుండా మల్లేశ్ (సీపీఐ), పాటి సుభద్ర, అమురాజుల శ్రీదేవి (టీడీపీ)కి నియోజకవర్గ ప్రజలు పట్టం కట్టి ఆదరించారు.

బెల్లంపల్లి: 1952 జనరల్ ఎన్నికలతో పాత ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటైంది. ఈ నియోజకవర్గం పరిధిలో ఆసిఫాబాద్, వాంకిడి, రెబ్బెన, తిర్యాణి, తాండూర్, భీమిని మండలాలతో పాటు పారిశ్రామిక క్షేత్రం బెల్లంపల్లి ప్రధాన పట్టణంగా ఉండేది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో బెల్లంపల్లి కొత్త అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పడింది. అప్పటి వరకు ఉమ్మడి ఆసిఫాబాద్ నియోజకవర్గానికి 12 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో 1952లో తొలిసారి జరిగిన ఎన్నికల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ (కాంగ్రెస్), 1957లో జరిగిన మలి విడత ఎన్నికల్లో జి.నారాయణరెడ్డి (కాంగ్రెస్) విజయం సాధించారు. ఆ తర్వాత 1962లో జరిగిన ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గాన్ని ఎస్టీలకు రిజర్వు చేశారు. ఆ తదుపరి 1967, 1972 ఎన్నికల వరకు ఎస్టీ అభ్యర్థులకు పోటీ చేసే అవకాశం దక్కింది. వరుసగా ఆ మూడు ఎన్నికల్లోనూ గిరిజన నాయకుడు కొట్నాక భీంరావు (కాంగ్రెస్) ఎమ్మెల్యేగా ఎన్నికై రాజకీయ ఆధిపత్యాన్ని చాటుకున్నారు.

1978లో ఎస్సీ రిజర్వుడ్..

ఉమ్మడి ఆసిఫాబాద్ నియోజకవర్గాన్ని 1978లో ఎస్సీలకు రిజర్వు చేశారు. అంతకు ముందు వరకు ఆసిఫాబాద్ ప్రాంత నాయకులు ఎమ్మెల్యేగా ఎన్నిక కాగా బెల్లంపల్లి ప్రాంత నాయకులకు ఆ భాగ్యం కలుగలేదు. ఎస్సీలకు రిజర్వు చేసినప్పటి నుంచి బెల్లంపల్లి రాజకీయ నాయకుల దశ మారింది. వరుసగా 1978, 1983, 1985 (ఉప ఎన్నికలు), 1989, 1994, 1999, 2004లో జరిగిన సాధారణ ఎన్నికల్లో బెల్లంపల్లి వాస్తవ్యులైన కాంగ్రెస్, సీపీఐ, టీడీపీ నాయకులు ఎమ్మెల్యేలుగా విజయం సాధించి ఆసిఫాబాద్‌పై పట్టు బిగించారు.

హ్యాట్రిక్ సాధించిన గుండా మల్లేశ్..

ఎస్సీలకు రిజర్వు చేసిన తర్వాత ఆసిఫాబాద్ నియోజకవర్గంపై బెల్లంపల్లి ప్రాంత రాజకీయ నాయకులకు ఎదురులేకుండా పోయింది. 1978 ఎన్నికల నుంచి 2004 ఎన్నికల వరకు బెల్లంపల్లి నేతలే వరుసగా ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 1978లో జరిగిన ఎన్నికల్లో దాసరి నర్సయ్య (కాంగ్రెస్), 1983లో జరిగిన ఎన్నికల్లో గుండా మల్లేశ్ (సీపీఐ), 1985లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ గుండా మల్లేశ్ ఘన విజయం సాధించారు. 1989లో జరిగిన సాధారణ ఎన్నికల్లో రెండోసారి దాసరి నర్సయ్య, 1994లో జరిగిన ఎన్నికల్లో గుండా మల్లేశ్ మూడోసారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. 1999లో జరిగిన ఎన్నికల్లో డాక్టర్ పాటి సుభద్ర (టీడీపీ) విజయ బావుటా ఎగురవేసి తొలి మహిళా ఎమ్మెల్యేగా ఖ్యాతి గడించారు. 2004లో జరిగిన ఎన్నికల్లో అమురాజుల శ్రీదేవి (టీడీపీ) విజయం సాధించారు. ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి మూడు దఫాలు ఎమ్మెల్యేగా గెలిచి గుండా మల్లేశ్ రికార్డు సృష్టించారు. రెండుసార్లు దాసరి నర్సయ్య, పాటి సుభద్ర, అమురాజుల శ్రీదేవి ఒక్కోసారి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 2009లో ఏర్పడిన బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసిన గుండా మల్లేశ్ విజయం సాధించి తొలి ఎమ్మెల్యేగా గుర్తింపు పొందారు. ఆసిఫాబాద్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో మొత్తంగా నాలుగు సార్లు గుండా మల్లేశ్ విజయం సాధించారు.

ఎమ్మెల్యేలుగా ఎన్నికైన బెల్లంపల్లి నేతల వివరాలు

సంవత్సరం	ఎన్నికైన నేత	రాజకీయపార్టీ
1978	దాసరి నర్సయ్య	కాంగ్రెస్
1983	గుండా మల్లేశ్	సీపీఐ
1985	గుండా మల్లేశ్	సీపీఐ
1989	దాసరి నర్సయ్య	కాంగ్రెస్
1994	గుండా మల్లేశ్	సీపీఐ
1999	పాటి సుభద్ర	టీడీపీ
2004	అమురాజులశ్రీదేవి	టీడీపీ

విద్యార్థిని మృతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తాం



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజన విద్యార్థిని అనుమానాస్పద మృతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిందితులను పట్టుకుంటామని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి దొంగచింత పంచాయతీ పరిధిలోని భీంజీగూడకు చెందిన ఆదివాసీ విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్పీ ఆదివారం ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామస్తులు, కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థిని మృతిపై ఉట్నూర్ డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ, ఎస్సై, ఇంటలిజెన్స్ పోలీసులందరితో కలిసి విచారణ జరిపిస్తామన్నారు. ఇందుకు బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ నాగేందర్, సీఐ రామకృష్ణ, ఎస్సై మనోహర్, సిబ్బంది ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

రాయిసెంటర్ జిల్లా మేడి మెస్రం దుర్గు, ఆదివాసీ సంఘాల నాయకులు పుర్క బాపురావు, పెందూర్ ప్రభాకర్ మృతదేహాన్ని పరిశీలించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అగ్నికి ఆహుతవుతున్న హరితహారం మొక్కలు

సోన్: మండలంలోని న్యూవెల్మల్, పాక్‌పట్ల, బొప్పారం గ్రామాల్లో రహదారికి ఆనుకుని ఉన్న హరితహారం మొక్కలు ఆదివారం అగ్నికి ఆహుతయ్యాయి. రైతులు రహదారిపై మొక్కజొన్న పంటలను ఆరబెట్టి వ్యర్థాలను రోడ్డుకు ఇరువైపులా వదిలేయడంతో గుర్తు తెలియని వ్యక్తులు వాటికి నిప్పంటిస్తున్నారు. దీంతో వ్యర్థాలతో పాటు హరితహారం మొక్కలు కాలిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి హరితహారం మొక్కలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.



గుడుంబా స్థావరాలపై దాడులు

నెన్నెల: మండలంలోని శ్రావణ్‌పల్లిలో గుడుంబా స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించినట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. ఈ దాడుల్లో 25 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని మామిడి తోటల్లో పాతిపెట్టిన 200 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామానికి చెందిన డేగరి వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండలంలోని వెంకట్రావుపేటలో ఈ నెల 24న అదృశ్యమైన వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. గ్రామానికి చెందిన బీరయ్య (38) కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నెల 24న ఇంటినుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం చెల్లంపేట గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కుక్క కాటుతో బాలుడికి గాయాలు



గాయాలపాలైన బాలుడు

బెజ్జూర్: మండలంలోని సులుగుపల్లి గ్రామానికి చెందిన ఆత్రం ఆదిత్య అనే బాలుడిని కుక్క కాటువేసింది. ఆదివారం ఉదయం బాలుడు తన ఇంటి బయట ఆడుకుంటుండగా కాలు, వెన్నుపై కరవడంతో గాయాలయ్యాయి. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అభయారణ్యంలో అందమైన భవనం

- ప్రారంభానికి ముస్తాబైన వాచ్‌టవర్



ముస్తాబైన వాచ్‌టవర్

వేమనపల్లి: కలప అక్రమ రవాణా నివారణ, వన్యప్రాణుల సంరక్షణకోసం అటవీశాఖ అడవిలో వాచ్ టవర్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి, కుశ్నపల్లి రేంజ్, వేమనపల్లి సెక్షన్‌లోని అటవీ ప్రాంతాల్లో వాచ్‌టవర్ నిర్మాణం పూర్తి అయ్యింది. సుమారు రూ.12 లక్షల నిధులతో మూడు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. రెండు రోజుల్లో కాళేశ్వరం ఎఫ్‌డీపీటీ, సీఎఫ్ వినోద్‌కుమార్, డీఎఫ్ఓ ఆశిస్‌సింగ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. రేంజ్ అధికారి గోవింద్‌చంద్ సర్దార్ ఆధ్వర్యంలో భవనానికి రంగుల అద్దకం, వైరింగ్ పనులు పూర్తి చేశారు. ఆకుపచ్చని అడవిలో అదే రంగుతో వన్యజీవుల చిత్రాలతో ముస్తాబు చేస్తున్నారు.

మూడు వైపులా దారులు

టైగర్ రిజర్వు ప్రాంతం కావడంతో ఇప్పటికే మూడు వైపులా రోడ్లు నిర్మించారు. అవసరం ఉన్న చోట ఒర్రెలపై లోలెవల్ వంతెలను నిర్మించారు. టవర్ వద్దకు వెళ్లేందుకు వేమనపల్లి నుంచి రాజారాం మీదుగా ప్రత్యేక రోడ్డు ఏర్పాటు చేశారు. కొమురంభీం జిల్లా గిరివెల్లి అటవీ ప్రాంతం వైపు నుంచి, నాగారాం లోతొర్రె ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు రోడ్లు వేశారు. వాచ్‌టవర్‌కు 10 కిలోమీటర్ల దూరం నుంచి మూడు వైపులా రోడ్లు పూర్తి అయ్యాయి. ఏ సమయంలోనైనా ఉన్నతాధికారులతో పాటు స్థానిక సిబ్బంది టవర్ వద్దకు వెళ్లేందుకు దారులు సిద్ధం చేశారు. అవసరమైతే టవర్ వద్దే రాత్రిపూట బస చేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు.

మోసగించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: యజమానికి తెలియకుండా బ్యాంక్ అకౌంట్ నుంచి చెక్కుల ద్వారా నగదు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని మోసగించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఓల్డ్ హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన ప్రణేష్ మావలలోని శ్రీ వినాయక ఫిల్లింగ్ స్టేషన్‌లో ఫిబ్రవరి నుంచి మేనేజర్‌గా పనిచేస్తున్నారు. పెట్రోల్ పంపులో డీజిల్, పెట్రోల్ ఆవిరి అవుతుందని రూ.11 లక్షల నష్టం చూపించారు. అనుమానం వచ్చిన యాజమాని సౌందర్‌పెల్లి శ్రీకర్ అతన్ని ఇటీవల విధుల నుంచి తొలగించారు. సంతకాలు చేసి ఉన్న ఆరు చెక్కులతో పాటు పెట్రోల్ పంపునకు సంబంధించిన లైసెన్స్, ఇతర విలువైన పత్రాలను యాజమానికి తెలియకుండా తీసుకెళ్లాడు. ఈ నెల 24న ప్రణేష్ ఖాతాలోకి రూ.35 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. పెట్రోల్ బంక్ యాజమాని శ్రీకర్ ఫిర్యాదు మేరకు ప్రణేష్‌పై కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

తొమ్మిది మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌరస్తాలో ఆదివారం మద్యం సేవించి వాహనం నడిపిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి, ప్రమాదాలకు కారణం కావద్దని ఆయన సూచించారు.

తీసుకున్న అడ్వాన్స్ చెల్లించాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబం

జైపూర్: రైస్ మిల్లు విక్రయిస్తానని తీసుకున్న అడ్వాన్స్ చెల్లించాలని మిల్లు యజమాని ఇంటి ఎదుట బాధిత కుటుంబం ఆందోళనకు దిగింది. జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన గుల్లపల్లి రాధ–సూర్యనారాయణ ఇదే గ్రామంలోని మహాలక్ష్మి రైస్‌మిల్లు విక్రయిస్తానని మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు చెందిన తోట వినోద్ వద్ద నుంచి రూ.39లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. మిల్లును ఇతరులకు విక్రయించడంతో పాటు తీసుకున్న అడ్వాన్స్ చెల్లించకపోవడంతో బాధిత కుటుంబం ఆదివారం సూర్యనారాయణ ఇంటిఎదుట ఆందోళనకు దిగింది. తమ డబ్బులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

జగన్మాతా.. దీవించు!

- జంగుబాయికి ఎంపీ 'సోయం' పూజలు



రావుడ్ దేవతకు మొక్కుతున్న ఎంపీ

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని మహరాజ్‌గూడ అడవుల్లో కొలువైన ఆదివాసీల ఆరాధ్య దేవత జంగుబాయిని ఆదివారం ఎంపీ సోయం బాపూరావు దర్శించుకున్నారు. సిద్దిసక, టోప్లకస, రావుడ్ దేవతలకు, ప్రత్యేక పూజలు చేశారు. మైసమ్మ, పోచమ్మ తల్లికి మొక్కుకున్నారు. ఏటా దసర పర్వదినం తర్వాత అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. బోథ్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా అధిష్టానం తన పేరు ఖరారు చేసిందని, విజయం వరించేలా చూడాలని జంగుబాయిని వేడుకున్నట్లు ఎంపీ తెలిపారు.

'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలి'

మంచిర్యాలరూరల్: ముస్లింలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ముస్లిం జాక్ రాష్ట్ర కోఆర్డినేటర్ యూసుఫ్‌బాబా అన్నారు. ఆదివారం పట్టణంలోని మంజునాథ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ముస్లిం డిక్లరేషన్ సదస్సుకు హాజరై మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించలేదని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కూడా మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ముస్లింలకు 22 డిమాండ్ల డిక్లరేషన్ అమలు చేసే పార్టీని గెలిపించుకోవాలనే ఉద్దేశంతో సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ఇబ్రహీం పాల్గొన్నారు.